# బూర్జువా కుక్క

## చాగంటి సోమయాజులు

ఈ కథ 1945వ సంవత్సరంలో "ధంకా" ఉగాది ప్రత్యేక సంచికలో ప్రచురించబడ్డది. దీని ప్రతి నాకు దొరక్క చాసో కథలలో ప్రచురించ లేకపోయాను. ఆనాడు కొడవటిగంటి కుటుంబరావు మొదలైన మిత్రులకి ఈ కథ ప్రీతి పాత్రమైనది. చాసో కథలని సమీక్షిస్తూ కుటుంబరావుగారు "బూర్జువా కుక్క" వెయ్యలేదని జ్ఞాపకంతో రాశారు. దీనిని డాక్టరు అత్తలూరి నరసింహారావుగారు సేకరించి నాకు ఇచ్చారు. శాశ్వతంగా కాల గర్భంలో కలిసిపోయి అనుకొన్న ఈ కథని ఆయన సేకరించి నాకు ఇచ్చినందుకు చాల కృతజ్ఞుణ్ని. ఈనాటి పాఠకులకి దీనిని అందిస్తున్నాను. తిరిగి రెండవ సారి ప్రచురిస్తున్నా తొలిసారి ప్రచురణగానే భావించవచ్చు।

—చాసో




నేను రోడ్డంటే పోతున్నాను. నా పక్కగా కారొచ్చి నిలబడ్డాది. కారులో ఆసామీ "హల్లో" అంటే "హల్లో" అన్నాను.

కారులో ఆసామీ సామాన్యుడు కాడు. బాగా చదువుకొన్నవాడనీ. ఉన్నతాశయాలు కలవాడనీ. ముఖ్యంగా పెద్ద స్థితిపరుడనీ ప్రతీతి. నాకు చిన్నప్పుడు బాగా స్నేహితుడు। పెద్దయిన తరువాత జీవితాలలో బాటలు వేరువేరుఅయిపోయాయి.

"నాతో నువ్వు రావాలి" అన్నాడు.

దానికేం భాగ్యం? కారులో కెక్కించుకొని క్లబ్బుకి మోసుకుపోయి అక్కడ చిన్న ఫలహారం తగిలిస్తూ, మామూలు

మాటలైనాక అతనో విశేషం చెప్పాడు.

"ఈ మధ్య నీ కథలు కొన్ని చదివేను కథలు నన్ను కొనదాకా తీసుకెళ్లనూ తీసుకెళ్ళాయి. నేను చదవనూ చదివాను. కథల్లో శిల్పం వుంది. నేను సర్టిఫికేట్ ఇస్తున్నా. గోడకి తగిలించుకో" అన్నాడు.

"గోడకేం? మెడకే తగిలించుకోవాలి" అన్నాను.

"అదే చెయ్యవలసింది. నావంటి కల్చర్డు జెంటిల్మన్ ఇచ్చిన తాఖీదు సామాన్యమైనదికాదు. నువ్వు నాకు చాలా కృతజ్ఞత చూపవలసి వుంది. కథలు చదివినందుకు, తరువాత నాకు కలిగిన భావాల మూలంగా నువ్వు కనబడగానే తన్ననందుకు!"

"కథలు ఆగ్రహానికి కారణమయాయా?"

"ఒళ్ళు మండుకొచ్చింది. ఆ రాతలు నాకు తలనొప్పి చిన్నప్పుడు నీకెన్నో మధురభావాలుండేవి. ఏమైనాయి? మధుర స్వప్న శాఖగా విస్తరించవలసిన నీ సాహితి తుమ్మకొయ్యగా చిగుళ్ళు పెడుతున్నది. నీలో రొమాన్సు చచ్చింది."

"రొమాన్సు కర్థం తెలుసా?"

"సరి! ఆంగ్లపద విన్యాసం ఫొలరు దొర మన దగ్గర నేర్చుకోవాలి. నువ్వంతా పెడమార్గాన్ని పోతున్నావు. చిన్న సలహా యిస్తాను."

"బాలాదపి సుభాషితమ్!"

"అప్రాచ్యుడా! నన్ను కుర్ర వెధవని చేస్తావ్?"

"అని ఎక్కడన్నాను?"

"ధ్వనించేవు. ఆల్‌రైట్ ఈ మధ్య నీ కథలు కొన్ని చదువవలసి వచ్చింది."

"చిక్కే!"

"చిక్కేపడ్డాను. అవి నన్ను లాక్కుపోయాయి. దాంతో మరీ రిమ్మెత్తు కొచ్చింది. వాస్తవం చెబుతున్నాను. కొన్ని కథలు చదివితే ఏడుపొచ్చింది. అనవసరంగా నీ మూలాన్ని మనస్సు పాడైంది. కథావస్తువుని బాగానే పని చేస్తావు. కాని చెప్పేనుగా పెడమార్గం పట్టేవ్. కథల్లో ముఖ్యంగా నాకు నచ్చింది నువ్వు సృష్టించే వాతావరణం. నాకు చిన్న ఉపకారం చెయ్యాలి. చేస్తావా?"

"చెప్పు!"

"నాకో కథ రాసి పెట్టాలి. జరిగిన విషయమే నువ్వయితే అందంగా చెప్తావు."

"చెప్పు!"

"మరేం లేదు. గత సంవత్సరం లూసీ అన్న తెల్లపిల్లిని వెంటబెట్టుకుని ఊటీ వెళ్ళేను. నెల్లాళ్ళు దాన్ని నేను భరించడానికి, అది నన్ను భరించడానికి ఏర్పాటు."

'భార్యా భర్తలుగా నెల్లాళ్ల కాలక్షేపం చెయ్యడానికి.'

'సరిగ్గా చెప్పేవు. డబ్బు మనకి బాగా వొదిలిపోయిందనుకో. అయితేనేం? ఊటీ కొండలకి మేఘాలెంతందమో ఊటీ బంగళాలకి లూసీ అంత అందము! లూసీ తనతో 'బూర్జువా. (Borzoi) కుక్కనొకటి వెంట పెట్టుకొచ్చింది."

"బూర్జువా కుక్కేమిటి?"

'నీకు కుక్కల జాతులు తెలియవు. ఒట్టి నాటు వెధవ్వి! ఎలాగ తెలుస్తుందిలే! బూర్జువా కాదు. బొర్జువా. అదొక ఐరోపా జాతి కుక్క!"

"బూర్జువా దొరసానిగారి బూర్జువా కుక్క."

"బాగానే అన్నావు దానికేం, వుంపుడుకత్తే మిదమనకెంత మమకారమో పెంపుడు కుక్క మిదలూసీకంత మమకారం. నాలుగు రోజులు ఊటీని 'బ్యూటీ' అన్నాము బూర్జువా కుక్క కూడా మాతోపాటు ఊటీని ఆనందిస్తున్నది. దానికి కూడా కావలసిన సొసైటీ రొమాన్సు వున్నాయి. ఒకనాడు ఏ పాము కరచిందో బూర్జువా చచ్చిపడి వుంది."

"లూసీకి చాలా పెద్దదెబ్బే."

"హృదయానికి పెద్దగాయం తగిలినట్టు ఏడుపులు మొదలు పెట్టింది."

"పాపం!"

"ఆ పాపం! దీనేడుపు వినడానికి తీసికెళ్ళానా!"

"ఏం చేశావు?"

"ఇంకొక బూర్జువాని దీని తాతలాంటి దాన్ని కొనిస్తాను. కుక్క కోసం ఏడుపేమిటి" అన్నాను. విరహ తాపంలాగ పట్టుకొంది. అంత మమకారమేమిటి? కుక్కపోతే కుక్క రాదూ? నేను చెప్పేను" నా యెదట ఏడుపులు పనికిరావు లేకపోతే వచ్చిన తోవనే నడువు" అన్నాను.

"డబ్బు భాయ్! విస్కీ వైనులతో నా దగ్గర విచారాన్ని దిగమింగి' దాని ఖర్మానడి వొంటరిగా వున్నప్పుడు కుక్క కోసమేడ్చేది. నాకేం? నేను హాయిగా పావురాయి పక్షాలమీద ఊటీ విహాయసమంతా వలయ గమనాలతో కాలం ఎగురనిచ్చేను.

ఊటీ నాకు కామెడీ, లూసీకి ట్రాజడీ ఇదీ కథ దీన్ని నువ్వు ఎలాగ రాస్తావో రసవంతంగా వుండాలి."

"తప్పకుండా రాస్తాను."


"రాస్తావ్!"

"ఊఁ"

"నువ్వు రాయవు."

నేను రాస్తానన్నా నమ్మలేకపోతున్నాడు! నా కథల మూలంగా నా మతం కొంత బోధపడి ఉంటుంది. అందుచేత రాయనని అనుమానపడుతున్నాడు బాగా చిన్నప్పటి స్నేహితుడు. సాహిత్యాన్ని బాగా తరచిననాడు. కొన్ని గ్రంథాలకి కృతిపతి. కొన్ని ప్రచురణలకి రాజపోషకుడు. నాకు పెద్ద ఉపన్యాసమిచ్చేడు.

"ఈ మధ్యని కొందరు దరిద్ర సంగీతం ప్రారంభించారు, దరిద్ర సంగీతానికి ఆకాశం, భూమీ తాళం చిప్పలు చేసి సాహిత్యాన్ని దగ్ధం చేస్తున్నారు! వీరశైవులమని బురఖా తొడుక్కొని సాంఘిక వాదం ప్రచారం చేస్తున్నారు. మహేశ్వ రాస్థానంలో ఐశ్వర్యం బుగ్గి. బూడిదా! అక్కడ పుర్రెలో భిక్షని 'ఏమి జుర్రుకోగలం?



మన చుట్టూ ఏముంది? దరిద్రం. దుఃఖము వున్నాయి. దానికి మనమా బాధ్యులం! అది వాళ్ళ వాళ్ళ కర్మ. ఎక్కువ తక్కువలకి అదే కారణం. పూర్వజన్మ పునర్జన్మ నేను నమ్ముతాను. ఆర్యులు చెప్పినది మహాసత్యము. ప్రజా స్వామ్య సాంఘిక వాదాలన్నీ బుద్బుదాలు.

"మనకేం? మనం పెళ్ళికొడుకులం. పట్టుపరుపు ద్రాక్షసారా ఎదురుగా వున్నాయి. మన "భార్య" తరుణి. రూప వతి- ఇది మన పుణ్యం. చుట్టా అలో లక్షణా అని లక్షమంది ఏడుస్తూ వుండొచ్చు అది వాళ్ళ వాళ్ళ కర్మ మనకేం?

"నువ్వునాకు బాగా స్నేహితుడివి. చెడ డానికి సిద్ధంగా వున్నావు. అప్పుడే సాహి త్యాన్ని దరిద్రుల పాలు చేస్తున్నావు. ఇహనది కట్టిపెట్టు 'కవి ఎలాగుండాలి? పాదుషాలాగుండొద్దూ! కప్పురపు విడెం అందివ్వవలసింది అందివ్వొద్దూ!కవిత్వం ఎలాగుండాలి? ప్రెంచి వెనులాగ,రంగు, హంగు, గింగురూ ఉండొద్దూ?

అవన్నీ ఉండేటట్టు నా కథరాయి. ఏమంటావ్?" అన్నాడు. నేనువిపరీతమైన నవ్వునవ్వేను. అతను చెప్పిన దాని కంతకీ ఆ నవ్వే జవాబు! ఆ నవ్వుకి నాలుగు వేల అంచులున్నాయి. ఇప్పుడు తిరిగి అలాగ నవ్వమంటే నాతరం కాదు. వినివిని విన్న దానికి జవాబుగా అప్రయత్నంగా ఆ నవ్వు అతనిమీద నయాగరాలాగ విరుచుకు పడ్డాది.

అతని జీవితంమీద జీవితాశయాలమీద, నమ్మకాలమీద నాకు కలిగిన జుగుప్స, హేళన, ఆగ్రహం, తిరస్కారం నాలో రేగిన లక్షభావాలు ఆ ఒక్క నవ్వులో వ్యక్తమైనాయి! భాషలో పదజాలానికి అతీతమైన ప్రతిభతో అనేక భావాలని సూక్ష్మంగా ఆ నవ్వు వ్యక్త పరచింది.

అతను బాగా నొచ్చుకున్నాడు. సాహితీ పరులంతా అతని చుట్టూ పరిభ్రమిస్తూ భజన చేస్తూ వుంటారు. నా తిరస్కా రాన్ని సహించగలడా?

"మీరంతా సాహిత్యానికి చీడ పురు గులు నీకు సరియైన మార్గం చెప్పేను. నీలో మారే స్వభావం లేదు. మారకపోతే మనిషికాడు నేను చెప్పిన కథ నువ్వె క్కడ రాస్తావు? నిన్ను చూచి విచారించ వలసి వుంది. విచారించడం నా స్వభావం కాదు."

అని అంత్యోపన్యాసమిచ్చి నెత్తిమీద హేటు బోర్లించుకుని బిల్లు తనే యిచ్చేసి నా మొహమైనా మరి చూడకుండాకారులో దూరి స్టార్టు చేసుకుపోయాడు.

బూర్జువా కుక్క కథ నేను రాయనను కున్నాడు. అక్కడ నా నవ్వు పొరపాటు అభిప్రాయం అతనిలో కలిగించింది. కథ నేను రాశాను. ఆ వర్గ జీవితాన్ని దులప వలసిన రీతిగా దులిపి దులిపి రాశాను. రాస్తున్నంతసేపూ నాచుట్టూ ఆనందం గువ్వపుట్టలాగా గుబాళించింది.



అలనాటి చరిత్రలు - ఈనాటి మేటి నవలలు



శ్రీ ప్రసాద్ రచనలు
(విజయ సీరియల్స్)



విజయనగర పతనం-1 — 13.00
విజయ నగర పతనం-2 — 12.00
షాజహాన్ — 13.00
సామ్రాట్ శ్రీరంగరాయ — 10.00
లకుమాదేవి (ల్లాదేవి రచన ఆంధ్రభూమి సీరియల్) — 15.00
ఆర్య చాణక్య — 13.50
అప్పాజీ — 12.00
యుగంధర్ — 13.50
రోషనార — 10.00



* అన్ని బుక్ షాపుల్లోనూ దొరుకుతాయి. దొరక్కపోతే కోరిన పుస్తకాల విలువలో ఒక రూపాయి తగ్గించి M.O. పంపితే మిగిలిన మొత్తానికి V.P.లో పంపుతాము!

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరురోడ్
విజయవాడ-520 002